

ఉద్యోగుల నిరసన దీక్ష

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు శనివారం నిరసన దీక్ష చేపట్టారు.

- 8లో ▸



సంస్కృతికి నిలయాలు..

గ్రంథాలయాలు సంస్కృతికి నిలయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /15.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

30 పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెల 7 వ తేదీ వరకు 30, 30ఏ పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ సింధు శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేనిదే ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'వినూత్న ఆవిష్కరణలు చేయాలి'



కామారెడ్డి టౌన్: విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలు చేయాలని డీఈవో రాజు సూచించారు. రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాల సందర్భంగా 'తరగని శక్తి వనరులు' అనే అంశంపై కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందంచారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, పాఠశాల హెచ్ఎం నరహరి రాజు, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణాకర్‌రావు, పోటీల నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్

కామారెడ్డి టౌన్: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6, 7 తేదీలలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ నిర్వహించనున్నట్లు డీఈవో రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌ల ప్రదర్శన, న్యాయ నిర్ణేతల పరిశీలన, రెండో రోజు వివిధ పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రదర్శన తిలకించే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఏడో తేదీ సాయంత్రం విజేతల ప్రకటన, బహుమతుల ప్రదానోత్సవం, కార్యక్రమ ముగింపు ఉంటాయని తెలిపారు.

'ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు'



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ వ్యవహారంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల కోసం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, లీగల్ సెల్ అధ్యక్షుడు దేవరాజుగౌడ్, నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యుల బైక్ ర్యాలీ

కామారెడ్డి టౌన్: ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కామారెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో వైద్యులు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఐఎంఏ జిల్లా కార్యదర్శి అరవింద్ శనివారం ఒక ప్రకటనలో పెర్కొన్నారు. వైద్యులందరూ డ్రెస్ కోడ్‌తో ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

ఆమె.. అన్నింటా మేటి!

వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థినులు

ఇందుగలదందు లేదను సందేహము వలదు.. ఏ రంగంలో చూసినా ఆమె ముద్ర కనిపిస్తోంది. చదువులో రాణిస్తూనే ఆటలు, ఇతర రంగాల్లోనూ సత్తా చాటుతోంది. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో నింగే హద్దుగా దూసుకుపోతూ ఔరా అనిపిస్తోంది. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థినులపై 'సండే స్పెషల్'..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



సండే స్పెషల్

షూటింగ్‌లో సత్తాచాటిన అక్షిత



జంగంపల్లికి చెందిన పేరం అక్షిత పదో తరగతి చదువుతోంది. గతేడాది ఎయిర్ పిస్టల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 4 వందల స్కోరింగ్‌కుగాను 348 స్కోర్ సాధించి ఆరో ర్యాంక్‌లో నిలిచింది. తర్వాత 6 వందల స్కోరింగ్‌కుగాను 522 పాయింట్లు సాధించింది. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డిస్ట్రిక్ట్ లెవల్ అండర్ 17 లో గోల్డ్ మెడల్ సాధించింది. స్టేట్ లెవల్‌లోనూ ప్రతిభ చాటిన అక్షిత.. ఈ నెలలో భోపాల్‌లో జరిగే నేషనల్ గేమ్స్‌లో పాల్గొననుంది. గతంలో ఢిల్లీలో జరిగిన గన్ ఫర్ గ్లోరీ, సీఎం కప్ చాంపియన్‌షిప్ పోటీలలోనూ పాల్గొని ప్రతిభచాటింది. ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని అక్షిత చెబుతోంది.

దూసుకెళ్లే బాణం భవాని



కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పీజీ చదువుతున్న ఆకంశెట్టి భవాని విలువిద్యలో సత్తా చాటుతోంది. ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 11 సార్లు పాల్గొన్న భవాని.. మూడుసార్లు బంగారు పతకం, నాలుగుసార్లు రజత పతకం, నాలుగుసార్లు కాంస్య పతకం సాధించింది. జాతీయ స్థాయిలో సీనియర్ విభాగంలో నాలుగుసార్లు, జూనియర్ విభాగంలో రెండుసార్లు, యూనివర్సిటీల విభాగంలో రెండుసార్లు, ఎస్‌జీఎఫ్ విభాగంలో మూడుసార్లు, మినీ విభాగంలో ఒకసారి పాల్గొని ప్రతిభ చాటింది.

కథా రచనలో స్వప్న



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న స్వప్న స్నేహం విలువ అన్న కథను రాసి కాలేజీలో వినిపించి అందరి మన్ననలు అందుకుంది. మనిషిలో మార్పు, అత్యాశ గల కోడి, పువ్వుల గొడవ వంటి కథలు రాసింది. చదువులో రాణిస్తూనే కథలు రాయడంలోనూ ముందుండే ప్రయత్నం చేస్తోంది.

ఎన్‌సీసీ కెడెట్‌గా పూజ



కామారెడ్డి పట్టణంలోని ఆర్‌కే డిగ్రీ కాలేజీలో బీఎస్సీ డేటా సైన్స్ ఫైనలియర్ చదువుతున్న రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన పూజ.. ఎన్‌సీసీ కేడెట్‌గా పలు శిబిరాల్లో పాల్గొంది. ఇటీవల అనంతపూర్‌లో నెల రోజుల శిబిరాన్ని విజయవంతంగా ముగించింది. తలసైనిక్ క్యాంపునకూ హాజరైంది.

పార్లమెంటులో గళం విప్పిన మౌనిక



కామారెడ్డి పట్టణంలోని ఆర్‌కే కళాశాలలో పీజీ చదువుతున్న కె.మౌనిక.. గతంలో నేషనల్ యూత్ ఫెస్టివల్ సందర్భంగా పార్లమెంట్ వేదికగా మాట్లాడి అందరినీ అబ్బుర పరిచింది. గిరిజన తండాలో పుట్టిపెరిగిన మౌనిక తన వాగ్ధాటితో అందరినీ ఆకట్టుకుంది. చదువులోనూ ముందున్న మౌనిక మంచి స్పీకర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతోంది.

వాలీ బాల్ ప్లేయర్ కీర్తన



కామారెడ్డి పట్టణంలోని సాందీపని డిగ్రీ కాలేజీలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న డి.కీర్తన వాలీబాల్ ఆటలో రాణిస్తోంది. కేరళలోని కొట్టాయంలో ఇటీవల జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంది. నేషనల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న కీర్తన.. పలు జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నీలలో పాల్గొని సత్తా చాటింది.

ఎన్‌సీసీలో రాణిస్తున్న హరిత



కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ ఎంపీసీఎస్ చదువుతున్న గాంధారి మండలం చిన్న గుజ్జుల్‌కు చెందిన హరిత.. ఎన్‌సీసీలో చేరింది. వివిధ స్థాయిలలో నిర్వహించిన శిబిరాలలో పాల్గొంది. తలసైనిక్ క్యాంపులో సత్తా చాటి కాంస్య పతకం పొందింది.

'మెమరీ' చాంపియన్ మధుమిత



జంగంపల్లికి చెందిన పేరం మధుమిత రూబీ క్యూబ్స్, బైనరీ నంబర్స్ మెమరీ చాంపియన్‌షిప్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించింది. జాతీయ స్థాయి మెమరీ చాంపియన్‌షిప్‌లో బైనరీ నంబర్స్ ప్లేయింగ్ కార్డ్స్ అండ్ వర్డ్స్ పోటీల్లో పాల్గొంది. వరల్డ్ చాంపియన్ షిప్ (ఆన్‌లైన్)లో మూడో స్థానంలో నిలిచింది. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని చెబుతోంది.

కథలతో మేల్కొలుపుతున్న స్రవంతి



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న స్రవంతి సమాజాన్ని మేల్కొలిపే కథలు రాస్తోంది. ఇప్పటి వరకు 15 కథలు రాసింది. ఆవు కడుపు కోత, నరేశ్‌లో మార్పు వంటి కథలు రాసింది. మరిన్ని సందేశాత్మక కథలు రాసి పుస్తకాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

లక్ష్యానికి చేరువలో ధాన్యం కొనుగోళ్లు



నిజాంసాగర్ మండలంలో వరిధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

- 3.8 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ. 691 కోట్లు జమ

నిజాంసాగర్: జిల్లాలో వరిధాన్యం సేకరణ లక్ష్యానికి చేరువయ్యింది. 4 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల సేకరణ లక్ష్యంగా కొనుగోళ్లను ప్రారంభించిన అధికారులు.. ఇప్పటివరకు 3.8 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. జిల్లాలో ధాన్యం సేకరణ కోసం వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో కలిపి 424 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 59,915 మంది రైతుల నుంచి రూ. 882 కోట్ల విలువైన వడ్లను కొనుగోలు చేశారు. ఇందులో రూ. 691 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. మిగిలిన డబ్బులు త్వరలోనే రైతుల ఖాతాల్లో చేరనున్నాయి.



ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తూ..

తూకం వేసిన వడ్లను ఎప్పటికప్పుడు లారీలలో రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.

89,773 క్వింటాళ్ల సన్న వడ్లు..

జిల్లాలో ఇప్పటివరకు 89,773 క్వింటాళ్ల సన్న రకం వరిధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయించిన 11,365 మంది రైతులకు బోనస్ కింద రూ. 37.16 కోట్లు చెల్లించారు. వడ్ల పైసలు జమ అయిన రెండు రోజుల్లోనే బోనస్ వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భోజనం నాణ్యతను పరిశీలించాలి

- తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను ఇన్‌చార్జి అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంఈవోలు, వార్డెన్‌లకు ఆహార భద్రతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యత గల భోజనం అందేలా చూడాలన్నారు. ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వస్తువులు, పదార్థాలు గడువు తేదీ ముగిసినవి వాడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పురుగులు పట్టిన బియ్యం ఉంటే పౌరసరఫరాల సంస్థకు తిరిగి పంపించాలని సూచించారు. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకోవాలని, సరుకులు, బియ్యం సంచులను బెంచీలపై ఉంచాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి విద్యాసంస్థలో ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రతిరోజు విద్యార్థులకు అందించే భోజనాలను పరిశీలించాలని, విద్యార్థులతో భోజనాలు చేయాలని సూచిచంఆరు. మండల మానిటరింగ్ అధికారులు స్కూల్స్, హాస్టళ్లను పర్యవేక్షించాలన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇప్పటికే జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్ తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు వేడి భోజనం అందించాలని, చేతులు శుభ్రంగా కడుక్కునేలా చూడాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో, బీసీ సంక్షేమ అధికారి చందర్ నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయోత్సవాలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఆదివారంనుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయోత్సవాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల విజయగాథలను తెలిపే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్, జిల్లా అటవీ అధికారి నిఖిత, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నేటినుంచి ఎస్సీఎస్టీటీయూ రాష్ట్ర మహాసభలు

- రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరానున్న ఉపాధ్యాయులు
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్



వేదిక వద్ద మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మూడో మహాసభలకు కామారెడ్డి వేదికవుతోంది. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్స్‌లో ఆది, సోమవారాల్లో ఈ మహాసభలు నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల హక్కుల కోసం పనిచేస్తున్న తమ సంఘం మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి ఉపాధ్యాయులు తరలిరానున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడుతూనే తాము ఎదిగి వచ్చిన సమాజాన్ని చైతన్యపరిచే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. సభల్లో వివిధ అంశాలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఆత్మీయ అతిథులుగా వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ప్రత్యేక అతిథులుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం చైర్మన్ లచ్చిరెడ్డి, అలాగే జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

'రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నాం'

బాన్సువాడ: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ శాఖా సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో జరిగిన రైతు పండుగలో ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. రైతు పండుగలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. విత్తనాలు నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు తీసుకునే చర్యలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేశారు. పోచారం వాటిని పరిశీలించారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. రైతులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

రైతు పండుగకు తరలిన రైతులు

కామారెడ్డి రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన రైతుపండుగ బహిరంగ సభలో పాల్గొనేందుకు జిల్లానుంచి రైతులు తరలివెళ్లారు. కలెక్టరేట్ వద్దనుంచి సుమారు వంద మంది రైతులు రెండు బస్సులలో వెళ్లారు. జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ ఉదయం 8 గంటలకు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. జిల్లాలో 25 మండలాల్లోగల రైతు వేదికలలో రైతు పండుగ మహాసభ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారని డీఏవో తెలిపారు.



బస్సులను ప్రారంభిస్తున్న డీఏవో తిరుమల ప్రసాద్

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


రాజు మృతదేహం

కామారెడ్డి క్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం ఉగ్రవాయి బ్రిడ్జి వద్ద శనివారం వెలుగు చూసింది. హైటెన్షన్ వైర్లకు సమీపంలో ఓ మృతదేహం ఉందని స్థానికుల సమాచారం మేరకు రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడిని కామారెడ్డిలోని గోసంగి కాలనీకి చెందిన కోదండం రాజు(26)గా గుర్తించారు. అతడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉగ్రవాయి బ్రిడ్జి వద్ద పడేసి ఉంటారని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ సీఐ రామన్ పేర్కొన్నారు.

కూలిన భారీ వృక్షం



లింగంపేట: మండల కేంద్రంలోని అజయ్ ఆస్పత్రి పక్కన ఉన్న భారీ మర్రి వృక్షం శనివారం ఉదయం కూలింది. వారం రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు చెట్టుకు నిప్పు పెట్టడంతో కూలిపోయింది. కూలిన సమయంలో ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు కరెంటు తీగలపై పడడంతో వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు తీగలను సరిచేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చుట్టుపక్కలవుంటే కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

మహబూబ్‌నగర్ తరలిన నాయకులు



తాడ్వాయి: మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగే రైతు పండుగ కార్యక్రమానికి తాడ్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మహబూబ్‌నగర్‌కు తరలి వెళ్లారు. నాయకులు బల్వంతురావు, నారాయణరెడ్డి, లింగం, రాజేందర్, గఫూర్, కార్యకర్తలు ఉన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య పోటీలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి సాంస్కృతిక నృత్య పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. దేశభక్తి, జానపద పోటీల్లో వసతిగృహాల విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానల మోహన్‌రెడ్డి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్రవంతి, నర్సయ్య, గంగాధర్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.


కామారెడ్డిలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు


మహమ్మద్‌నగర్‌లో..

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష

సాక్షి నెట్‌వర్క్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు జిల్లా అంతటా నిరసన దీక్ష చేపట్టారు. ప్రభుత్వం తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరికి పీఆర్టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. అనంతరం ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేశారు.


మద్నూర్‌లో..


ఎల్లారెడ్డిలో..


లింగంపేటలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


నస్రుల్లాబాద్‌లో..


బిచ్కుందలో..

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు


చికిత్స పొందుతున్న రమేశ్

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన వడ్ల రమేశ్ వారం రోజుల క్రితం పని చేస్తున్న ప్రాంతంలో కింద పడటంతో మెడ నరానికి గాయంతో పాటు వెన్నెముకలోని బోన్ విరిగింది. దీంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ పూర్తయి చికిత్స అందుతోంది. ఇప్పటి వరకు రూ. 4 లక్షల వరకు ఖర్చయింది. ఇంకా రూ. 4 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. అలాంటి ఇంటి పెద్దదిక్కు కదలలేని స్థితిలో ఉండి చికిత్స కోసం నగదు లేక అల్లాడుతోంది. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఎవరైనా స్పందించి తమను ఆదుకోవాలని ఆ బాధిత కుటుంబం కోరుకుంటోంది. దాతలు 9849940083, 9701593953 నంబర్లను సంప్రదించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగ్గురు టీచర్లకు నోటీసులు

బోధన్‌రూరల్: మండలంలోని కొప్పర్గలో ఉన్న ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి నోటీసులు జారీ చేశారు. శనివారం ఉదయం ఎంఈవో నాగయ్య పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా, ఉపాధ్యాయులు ఖాజామోయిన్, అతీఖుద్దీన్, రహీముద్దీన్ విధులకు ఆలస్యంగా వచ్చారు. దీంతో వివరణ కోరుతూ ఆ ముగ్గురికి నోటీసులు ఇచ్చారు. టీచర్లు వివరణ ఇచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

విద్యార్థినుల ప్రతిభ

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం శరత్ శనివారం తెలిపారు. అనంతరం విద్యార్థినులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు అదనపు కలెక్టర్ విక్టర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖలీల్, సంతోష్, అల్తాఫ్, మోహన్, శశి, ధనరాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సదాశివనగర్: పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు శనివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, అరవింద్, రాజు, గంగరాజు, కవీన్, శివరామకృష్ణ, సత్యం, బాబు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుని రక్తదానం

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లో 19యేళ్ల యువకుని గుండె ఆపరేషన్ కోసం ఓ నెగిటివ్ రక్తం అవసరం కావడంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా శనివారం పర్ష తృషాల్ రక్తదానం చేశారు. రక్తదాత పర్ష తృషాల్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటరమణతో పాటు ఇద్దరు కొడుకులు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేస్తు మానవతవాదులుగా నిలుస్తున్నారని సమూహం వ్యవస్థాపకులు బాలు అభినందించారు.

'రైతుపండుగ'ను వీక్షించిన రైతులు


అడ్లూర్‌ఎల్లారెడ్డి రైతు వేదికలో రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నిర్వహించిన రైతుపండుగ కార్యక్రమాన్ని శనివారం జిల్లాలోని అన్ని గ్రామాల్లోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాల్లో రైతులు వీక్షించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి సీఎం వివరించారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారంలో కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్ రైతులతో కలిసి తిలకించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.


దేశాయిపేట్‌లో..


పెద్దకొడప్‌గల్‌లో..


నాగిరెడ్డిపేట్ మండలం గోపాల్‌పేటలో..


రాజంపేటలో..

గ్రంథాలయాలు సంస్కృతికి నిలయాలు


చైర్మన్‌ను సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

సదాశివనగర్: సంస్కృతికి నిలయాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు అవసరమైన స్టడీ మెటీరీయల్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గ్రంథాలయాన్ని ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు తెరిచి ఉంచాలని నిరుద్యోగులు కోరగా తప్పకుండా ఉంచుతామన్నారు. స్థానిక గ్రంథాలయానికి మరుగుదొడ్లు, నీటి వసతి, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని స్థానిక వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్ దృష్టికి తీసుకు రాగా నిధులు కేటాయించి వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం చైర్మన్‌ను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగారెడ్డి, మద్దెల బాగయ్య, బీరయ్య, రాజయ్య, సదాశివరెడ్డి, గంగాధర్, ఇర్షాదొద్దీన్, కుమ్మరి రాజయ్య, విఠల్, జగ్గబాల్‌రాజు, సంకరి లక్ష్మి, రాజలింగం, రాజేందర్, భాస్కర్ రెడ్డి, లింగారెడ్డి, సంగయ్య తదితరులు ఉన్నారు.

నర్సింగ్ కళాశాలలో సదుపాయాల కల్పన


సిబ్బంది,విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మాక్లూర్: మండల కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నర్సింగ్ కళాశాలను శనివారం ఆయన సదర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాలలో ఉన్న సీట్లకు అనుగుణంగా అడ్మిషన్లు పూర్తయ్యాయా? అని ప్రిన్సిపాల్ మోనికా విలాసిని అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ లేక భయంగా ఉందని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే కళాశాల నుంచి ప్రధాన రహదారి వరకు రోడ్డు వేయాలని కోరగా, ఉపాధి హామీ పథకం కంపోనెంట్ నిధులతో రోడ్డు నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇతర పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ శేఖర్, ఎంపీవో టి శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

బిచ్కుంద: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఎస్‌వో రాగిణి తెలిపారు. పీజీసీఆర్‌టీ ఇంగ్లీష్, సివిక్స్, నర్సింగ్ మూడు లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల వారు డిసెంబర్ 2 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9182108237 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొత్తాబాదిలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాదిలో కొనసాగుతున్న కేజీబీవీలో బయోసైన్స్, పీఈటీ పోస్టులకు సోమవారం స్పాట్ సెలెక్షన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలత తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ప్రాతిపదికన తాత్కాలిక పద్ధతిలో నియమించనున్నట్లు పేర్కొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీగా ఇంగ్లీష్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ ఇంగ్లీష్, బీఎడ్‌లతో పాటు టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులున్నారు. జిల్లా పరిధిలో అర్హులైన వారు సంబంధిత పోస్టుకు సోమవారం సాయంత్రం 4 గంటల లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి

తాడ్వాయి: సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో సవితారెడ్డి, ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎల్లారెడ్డి: పట్టణంలోని 12వ వార్డు పరిధిలో కాలనీవాసుల, కౌన్సిలర్ నీలకంఠం విన్నపం మేరకు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరనుందని పేర్కొన్నారు. అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కరువు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయం వద్ద భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా మారాయి. డోర్లు సరిగా లేకపోవడం, బకెట్లు, జగ్గులు లేక ఇబ్బంది పడ్డారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకనైనా ఆలయ అధికారులు స్పందించి తగు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జీవశాస్త్రానికి వంద మార్కులు కేటాయించాలి

కామారెడ్డి అర్బన్: ఉన్నత విద్యలో ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది నుంచి జీవశాస్త్రం సబ్జెక్టుకు వందమార్కులు కేటాయించాలని తెలంగాణ బయోసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కృష్ణాకర్‌రావు డీఈవోకు శనివారం వినతి పత్రం అందజేశారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ప్రతినిధులు సురేశ్, రాంరెడ్డి, నాగభూషణం, పూర్ణారావు, మల్లేశ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వన భోజనాలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం కార్తీక మాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి, డీఎం ఇందిరా, అధికారులు, ఉద్యోగులు, కండక్టర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకరి దారుణ హత్య


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి గాంధీ గంజ్ ఆవరణలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శనివారం ఉదయం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కూలీ పనులు చేయడంతోపాటు కాగితాలు ఏరుకుంటూ నిర్మాణంలో ఉన్న గంజ్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లో కొంత కాలంగా 10 మందికి పైగా ఉంటున్నారు. వారిలో సాయి అలియాస్ యేసు (35) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని కర్రలు, రాళ్లతో తలపై బలంగా కొట్టి హత్య చేశారు. అర్ధరాత్రి సమయంలో హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించి విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. అక్కడే ఉన్న ఓ వృద్ధురాలిని విచారించారు. మృతుడితోపాటు కాంప్లెక్స్‌లో ఉన్న వారిని విచారిస్తున్నామని సీఐ తెలిపారు. ఇతర రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు కూడా అక్కడే నివాసముంటున్నారని, వారే హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

రుద్రూర్: పొతంగల్ మండలం కల్లూర్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలొ ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కోటగిరి ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం వాజీద్‌నగర్‌కు చెందిన ఎం సాయిలు(48) బైక్‌పై హున్సా వైపు నుంచి వెళ్తుండగా కల్లూర్ శివారులో మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న బరంగెడిగి సాయిలుకు తీవ్రగాయలయ్యాయి. క్షత గాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సందీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.10 కోట్లకు వ్యాపారి ఐపీ?

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్ పి రాజారాం అండ్ సన్స్ యజమాని రూ.10కోట్లకు ఐపీ పెట్టినట్లు తెలిసింది. సదరు కమీషన్ ఏజెంట్ గత వారం రోజులుగా పరారీలో ఉన్నట్లు సమాచారం. ఆయన ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయారని, ఫైనాన్షియర్లు, ఇతర వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నట్లు తెలిసింది. రైతులకు, కమీషన్ ఏజెంట్ ఐపీ పెట్టడానికి ఎలాంటి సంబంధం లేదని, రైతులెవరికీ ఆయన అప్పుగా లేరని మార్కెటింగ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో పలువురు వ్యాపారులు రైతుల వద్ద పంట ఉత్పత్తులను తీసుకుని ఐపీ పెట్టిన ఘటనలు ఉన్నాయి.

బైక్ చోరీ నిందితుడి గుర్తింపు



ఖలీల్‌వాడి: నగరంలో బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గుర్తించినట్లు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. నిందితుడి వివరాలు తెలిసిన వారు లేదా గుర్తుపట్టే వారు 8712659837 నంబర్‌కు లేదా పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన కోరారు.

మెండోరాలో దొంగల అలజడి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు అలజడి సృష్టించారు. దీంతో గ్రామస్తులు తీవ్రభయాందోళనకు గురయ్యారు. రాత్రి పది గంటల తరువాత వడ్డెర కాలనీలోని ముళ్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు కాలనీకి చేరుకొని గ్రామస్తులతో కలిసి గాలించారు. గత వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేయాలని కోరుతున్నారు.

మాజీ సర్పంచ్‌పై కేసు

మోపాల్: మండలంలోని బైరాపూర్ మాజీ సర్పంచ్ సరిచంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సరిచంద్ కొడుకుకు అదే గ్రామానికి చెందిన అంబర్‌సింగ్ గతంలో డబ్బులు ఇప్పించాడు. కొన్నేళ్ల క్రితం సరిచంద్ కుమారుడు మృతి చెందడంతో అంబర్‌సింగ్ డబ్బుల విషయం అడిగాడు. మృతుడి భార్యతోపాటు సరిచంద్ డబ్బులు ఇస్తామని ఒప్పుకున్నారు. దీన్ని మనస్సులో పెట్టుకున్న సరిచంద్ రెండు రోజుల క్రితం కారు అడ్డుగా పెట్టావని అంబర్‌సింగ్‌తో గొడవకు దిగాడు. కారంపొడి, కత్తితో అంబర్‌సింగ్‌ను చంపేస్తానని బెదిరించాడు. బాధితుడు అంబర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్‌కు జరిమానా

మోపాల్: మండలకేంద్రం నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ శనివారం తెలిపారు. టిప్పర్‌ను మైనింగ్ అధికారులకు అప్పగించగా, వారు రూ.4వేల జరిమానా విధించారన్నారు. అనంతరం టిప్పర్‌ను రిలీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో సర్వే నంబర్ 17లో పబ్బ బాలయ్య అనే వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని అదే గ్రామానికి చెందిన పబ్బ రమేశ్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. అక్రమ ఇంటి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని మండల స్థాయి అధికారులను డీపీవో ఆదేశించారు.

పోలీసు శాఖ సహకారం ఎప్పటికీ ఉంటుంది



ఖలీల్‌వాడి: ఉద్యోగ విరమణ చేసిన వారికి శాఖ సహకారం ఎప్పటికీ ఉంటుందని, ఎటువంటి రిమార్క్ లేకుండా సర్వీసు పూర్తి చేయడం అభినందనీయమని అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు అన్నారు. పోలీసుశాఖలో ఆర్ఎస్సైగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కొంకటి సదానందంను శనివారం ఆయన ఘనంగా సన్మానించారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎస్ శ్రీనివాస్ రావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ వేసీపీ నాగయ్య, పోలీస్ కార్యాలయం సూపరింటెండెంట్లు శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశవాణి కదంబ'లో సిర్‌పూర్ విద్యార్థులు



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిజామాబాద్ ఆకాశవాణి శనివారం నిర్వహించిన 'ఆకాశవాణి కదంబ' కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలభారతి కార్యక్రమం కింద విద్యార్థుల కార్యక్రమాన్ని రికార్డ్ చేశారు. పాటలు, పద్యాలు, కవితలు, నాటికల సమాహారంగా కార్యక్రమం సాగింది. విద్యార్థులు చక్కని ప్రదర్శన కనబర్చడంతో వారితోపాటు తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ హజారే శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయుడు వి సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో రేడియో స్టేషన్ అధికారి మోహన్ దాస్ పాల్గొన్నారు.